సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం
ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో కడప-కర్నూలు జట్లు తలపడ్డాయి. -8లో



కొండను కొల్లగొట్టి..
ప్రకృతి వరప్రసాదమైన కొండలను రోడ్ల నిర్మాణం పేరుతో పూర్తిగా తవ్వేస్తున్నారు. ఇటాచీలతో కొండలను కొల్లగొట్టి గ్రావెల్స్‌ను భారీ లారీలతో తరలిస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.0/24.4

వాతావరణం
జిల్లాలో బుధవారం 24.4 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉల్లి కొనుగోలు
కడప సెవెన్‌రోడ్స్: మార్క్‌ఫెడ్ ద్వారా గురువారం నుంచి జిల్లాలో ఉల్లి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు జేసీ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ఒక క్వింటాలు రూ. 1200 ధరతో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ, మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తాము పండించిన ఉల్లి పంటను ఇంటివద్దే శుభ్ర పరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు


అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం శ్రీరంగనాథుడు అశ్వవాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణ పర్యవేక్షించారు. శుక్రవారం శ్రీరంగనాథుని కల్యాణాన్ని కల్యాణదుర్గం చల్లా వంశీయుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

బాధ్యతల స్వీకరణ


డీటీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్రాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా ఇన్‌చార్జ్ ఉప రవాణా శాఖ కమిషనర్‌గా (డీటీసీ) వీర్రాజు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం నగర శివార్లలోని ఊటుకూరు ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా డీటీసీగా విధులు నిర్వహిస్తున్న ఈయన్ను ఇన్‌చార్జ్ జిల్లా డీటీసీగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ సమస్యలపై కార్యాలయంలో నేరుగా సంప్రదించాలన్నారు.

నాటి స్ఫూర్తి.. నేటి కొప్పర్తి!

- డాక్టర్ వైఎస్సార్ సంకల్పం... వైఎస్ జగన్ సాకారం
- నాటి మొక్కే నేటి మహావృక్షం దిశగా అడుగులు
- 2019లో ఇండస్ట్రియల్ హబ్‌గా ప్రతిపాదనలు
- 2023లో సీఎం హోదాలో వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- తాజాగా ఉత్పత్తులను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్
- ఎంఎస్ఎంఈ సైతం అమరావతికి తరలించిన వైనం
- అన్యాయం చేస్తూనే టీడీపీ వల్లే ప్రగతి అంటూ అబద్ధాలు


కడప నగర సమీపంలోని కొప్పర్తి పారిశ్రామిక వాడ

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా పారిశ్రామిక ప్రగతి సాధించాలని తద్వారా ప్రత్యక్ష ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పిస్తే... తండ్రి సంకల్పాన్ని సాకారం చేయడానికి గత ప్రభుత్వంలో సీఎం హోదాలో వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. మౌళికవసతులు సమకూర్చి పారిశ్రామిక ప్రగతికి అనువైన ప్రాంతంగా కొప్పర్తి పారిశ్రామికవాడను తీర్చిదిద్దారు. ఫలితంగా చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో రూ.2,147కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నాటి స్ఫూర్తితోనే నేటి కొప్పర్తిలో ఫలాలందుతున్నాయనే జగమెరిగిన సత్యాన్ని మంత్రి నారా లోకేష్ మరిచిపోయారు. అంతేనా..జిల్లాలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలించే కుటిల యత్నం చేసిన కూటమి సర్కార్ వైనాన్ని కప్పిపెట్టారు. కేవలం ప్రారంభోత్సవాలు చేసి తామే చేశామని గొప్పలు చెప్పుకోవడంపై జిల్లా వాసులు నవ్వుకుంటున్నారు.

- వైఎస్సార్ జిల్లాను పరిశ్రమల ఖిల్లాగా తీర్చిదిద్దాలని కడపకు కూతవేటు దూరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దాదాపు 6వేల ఎకరాల్లో కొప్పర్తి పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పారిశ్రామికవాడకు మౌళిక సదుపాయాలు కల్పించారు. పైగా అందులో డాక్టర్ వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ కూడా నెలకొల్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడిదారులకు ఆహ్వానం పలుకుతూ లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందడుగు వేశారు.

పెట్టుబడుల వెల్లువ..

వైఎస్సార్ ఈఎంసీలో రూ.10వేల కోట్లు పెట్టుబడులు, దాదాపు లక్ష మందికి ఉద్యోగాలకు ప్రణాళికలు వేశారు. ఇదివరకే నాలుగు షెడ్లలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఉత్పత్తి ప్రారంభించింది. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా 1300 మందికి ఉద్యోగాలు లభించాయి. 1.5లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉన్న మరో మూడు షెడ్లను డిక్సన్ కంపెనీ తీసుకుంది. రెండో ప్లాంట్ విస్తరించేందుకు సిద్ధమైంది. డిజికాన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ, సెల్‌కాన్ రిజుల్యూట్, చంద్రహాస్ ఎంటర్ ప్రైజెస్, యూటీఎస్‌పీఎల్ సంస్థలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చాయి. ఈ ఆరు సంస్థలు దాదాపు రూ.600 కోట్లు పెట్టుబడులకు సిద్ధమయ్యాయి. వీటి ద్వారా 7500 ఉద్యోగాలు లభించనున్నాయి. అప్పట్లో వీవీడీఎస్ అనే మరో సంస్థ కూడా ఇక్కడ రూ.365 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థ ద్వారా 6400 ఉద్యోగాలు లభించనున్నాయి. బ్లాక్ పెప్పర్, హార్మోనిసిటీ అనే మరో రెండు ఎలక్ట్రానిక్ కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఐఓటీ డివైజ్‌లు, ట్యాబ్ తయారీ తదితర వస్తువులు ఇక్కడే తయారుకానున్నాయి. వీవీడీఎస్‌సంస్థ 5జీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్, బిగ్ డేటా, ఎనలిటిక్, ఒరిజినల్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ నిమిత్తం ఆయా సంస్థలు సిద్ధమవడం విశేషం.

వైఎస్ జగన్ కృషితోనే...


కొప్పర్తి పారిశ్రామిక వాడలో సీఎం హోదాలో ఓ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ జగన్ (ఫైల్)

కొప్పర్తి పారిశ్రామికవాడను పార్కు సిటీగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడానికి ప్రధాన కారణం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వల్లే అన్నది అందరికీ తెలిసిందే. దేశవ్యాప్తంగా 12ప్రాంతాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్మార్ట్ పారిశ్రామికవాడలు నెలకొల్పేందుకు సిద్ధమైంది. అందులో ఏపీలో విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి, హైదరాబాద్-బెంగుళూరు కారిడార్‌లో ఓర్వకల్లు పారిశ్రామికవాడల అభివృద్ధికి ముందుకు వచ్చింది. ఈ మేరకు కొప్పర్తిలో రూ.2,147కోట్లు పెట్టుబడులు పెట్టాలనే లక్ష్యంతో 54వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు దక్కేలా కేంద్రం ప్రణాళికలు చేసింది. ముఖ్య మంత్రుల హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మౌళిక వసతులు అనుకూలతలు అందుకు ప్రత్యక్ష కారణంగా నిలిచాయి.వాస్తవాలు ఇలా ఉంటే తమ వల్లే పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి లోకేష్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

2014-19లో పరిశ్రమలు ఏవీ?
సీఎం చంద్రబాబుకు .. తెలుగుదేశం పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కొప్పర్తి పారిశ్రామికవాడలో 2014-19లో ఒక్క పరిశ్రమైనా వచ్చిందా అని జిల్లా వాసులు నిలదీస్తున్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో ఇండస్ట్రియల్ మెగా హబ్‌గా ప్రతిపాదనలు చేశారు. 2023లో మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఫలితంగా పరిశ్రమలు స్థాపనకు మార్గం సుగమమైంది. కాగా ఇక్కడికి మంజూరైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను సైతం అమరావతికి తరలించే యత్నాన్ని కూటమి సర్కార్ చేసింది. పెద్ద ఎత్తున నిరసన తలెత్తడంతో వెనక్కి తగ్గింది. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా టీడీపీ పెద్దలు అబద్ధాలు చెబుతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై జేసీ అదితి సింగ్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని.. వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కార నివేదికలు కూడా అందడం లేదన్నారు. సంబంధిత మండల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులపై విచారణ జరపాలన్నారు. అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన,సూటి సమాధానం ఇవ్వాలన్నారు. తద్వారా అర్జీదారునికి సంతృప్త స్థాయిలో పరిష్కారం అందే దిశగా అధికారులు పని చేయాలన్నారు. ఈ విషయంలో జిల్లా శాఖాధిపతులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం.. ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్ పై సమీక్షించి పూర్ పర్ఫార్మెన్స్ రికార్డు నమోదైన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే..శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ రీ అడ్రసల్ సిస్టమ్‌లో భాగంగా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రత్యక్ష పోరాటం


కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు

కోర్ కమిటీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్. రఘురామిరెడ్డి, అంజద్‌బాషా, ఇతర ముఖ్య నాయకులతో కలిసి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేదని, ఉల్లి, చీనీ, మినుము పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 9న రైతు సమస్యలపై నియోజకవర్గాల వారీగా ర్యాలీలు, నిరసనలు చేయాలన్నారు. ఈ ర్యాలీలు, నిరసనల్లో రైతులు ఎక్కువగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, నూర్‌బాష్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓ. రసూల్, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైఎస్ జగన్ పర్యటన


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మాజీ సీఎం వైఎస్ జగన్ మూడు రోజుల పర్యటన విజయవంతం

పులివెందుల: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు. తన మూడు రోజుల పర్యటనలో భాగంగా 2వ తేదీ దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించా రు. మంగళవారం మద్ధతు ధర లేక అల్లాడుతున్న ఉల్లి రైతుల కష్టాలను స్వయంగా రైతుల పంట పొలాల్లోకి వెళ్లి తెలుసుకుని ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించారు. అలాగే అంబకపల్లె గంగమ్మ కుంట చెరువులో జలహారతి ఇచ్చారు. దారిలోని నల్లపురెడ్డిపల్లెలో స్థానికులతో మాట్లాడారు. సోమ, మంగళవారాలలో భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల కష్టాలు, పార్టీ కేడర్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారాలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచిస్తూ ప్రజలు, కార్యకర్తలలో మనో ధైర్యం నింపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీడ్కోలు పలికిన వారిలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలిసిరాని కాలం





- మరో 25 రోజుల్లో ముగియనున్న ఖరీఫ్
- ఇప్పటికే లక్ష్యానికి దూరంగా సాగు
- అరకొర సాగుకే యూరియా దొరక్క రైతుల అవస్థలు
- జిల్లావ్యాప్తంగా 27.31 శాతానికే సాగు పరిమితం


వీఎన్‌పల్లి మండలంలో సాగులో ఉన్న మినుము

కడప అగ్రికల్చర్: ఈ సారి ఖరీఫ్ కూడా రైతులకు కలిసిరాలేదు. సీజన్ ప్రారంభానికి ముందు వర్షాలు పలకరించినా.. ఆపై వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో చాలా మంది రైతులు పంటలసాగు చేయలేకపోయారు. మరో 25 రోజుల్లో సీజన్ కూడా ముగియనుంది. ఇప్పటికే ఖరీఫ్ లక్ష్యానికి ఆమడదూరంగా సాగు నిలిచిపోయింది. జిల్లావ్యాప్తంగా 77,551 హెక్టార్ల సాధారణసాగు కాగా ఇప్పటివరకు కేవలం 21,179.8 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. అంటే సాగు కేవలం 27.31 శాతానికే పరిమితమైంది. మిగతా 70 శాతంపైగా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. ఇక అక్కడక్కడ అరకొరగా సాగు చేసినా పంటలకు అవసరమైన యూరియా దొరక్క రైతులు అల్లాడిపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద యూరియా కోసం క్యూలో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతుల తమ పనులను సైతం వదులుకుని బస్తా యూరియా కోసం గంటలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించడంపై అన్నదాతలు అందోళన చెందుతున్నారు.

ఆశలన్నీ కేసీ కెనాల్‌పైనే....
తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సాగుపై అటు వ్యవసాయ అధికారులు ఇటు రైతులు కేసీ కెనాల్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు జిల్లాలో 92 వేల ఎకరాలకుపైగానే ఉంది. కేసీ కాలువకు నీరు వస్తుండటంతో చాలామంది రైతులు వరి పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయనున్నారు. దీంతో పాటు కేసీ కాలువకు నీరు వస్తున్న నేపథ్యంలో కేసీ పరిధిలో భూగర్భజలాలు కొంత మేర అభివృద్ధి చెంది బోర్ల కింద కూడా సాగు విస్తీర్ణం పెరగనుంది.


పాత కడప ప్రాంతంలో సాగులో ఉన్న వరి



యూరియా కోసం పడిగాపులు



నేను ఆరు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. సచివాలయానికి అరకొర వస్తోంది. అది వస్తే క్యూలో నిలబడి తెచ్చుకోవాల్సి వస్తుంది. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి అనుభవించలేదు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరఫరా యూరియాను సరఫరా చేయాలి. - నాగేశ్వర్ రెడ్డి, రైతు, రావులపల్లి, ఖాజీపేట మండలం

కేసీ కెనాల్ పరిధిలో...



ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందే వర్షాలు బాగా కురవడంతో సాగు పెరుగుతుందని ఆశపడ్డాం. కానీ ఎజన్ ప్రారంభం తరువాత వరణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. దీంతో సాగు అనుకున్న మేర కాలేదు. ఇటీవల కురిసిన వర్షానికి అరుతడి పంటలసాగు పెరిగే అవకాశం ఉంది. - చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

పెరిగిన నీటి ప్రవాహం


పెన్నానదిలో పారుతున్న మైలవరం నీరు

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోకి భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల మైలవరం మండలం వేపరాల సమీపంలో యువకుడు గల్లంతు కావడం.. ఆతని ఆచూకి లభ్యం కాకపోవడంతో నీటినినిలుపుదల చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటికి తీశారు. తాజాగా మైలవరం జలాశయం నుంచి అధికారులు పెన్నాలోనికి నీరు విడుదల చేశారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 4.5టీఎంసీల నీరు నిల్వ ఉంది. గండికోట జలాశయం నుంచి మూడు గేట్ల ద్వార పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మైలవరం ఇరిగేషన్ అధికారులు నీటిని 11వేల క్యూసెక్కుల మేర పెన్నానదిలోనికి విడుదల చేస్తున్నారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఇరిగేషన్ అధికారులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.

6న చలో విజయవాడ
కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుమంత్, మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

పోట్లదుర్తిలో యువకుడి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం ఎన్‌టీఆర్ కాలనీలో ముత్యాల శివనాగేష్(21) అనే యువకుడు ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శేషయ్య, లక్ష్మీదేవిల కుమారుడు ముత్యాల శివనాగేష్ కూలి పని చేస్తూ కుటుంబానికి ఆదరువుగా ఉండేవాడు. అయితే శివనాగేష్ ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతికి ఇటీవల మరో అబ్బాయితో వివాహం అయినట్లు తెసుకుని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ. 3 కోట్ల చీటీ డబ్బుతో మహిళ పరారీ?

కడప అర్బన్ : ఓ మహిళ తాను నివాసముంటున్న ప్రాంతంలో చీటీలు వేసి వచ్చిన డబ్బులు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి పరారైనట్లు తెలిసింది. కడపకు చెందిన మహిళ నాగరాజు పేటలోని రవి థియేటర్ సమీపంలో నివాసముంటోంది. చుట్టుపక్కల మహిళలను కలుపుకొని చీటీలు వేసుకుంటూ ఉండేది. గత కొంతకాలంగా చీటీల డబ్బులు దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసి మంగళవారం రాత్రి ఇల్లు ఖాళీ చేసి పరారైంది. దీంతో బాధితులు కడప వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

– ఎస్ఐకి చార్జ్ మెమో

కడప అర్బన్ : కడప నగరం టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ పోలీస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప నుంచి అతన్ని పులివెందులకు బదిలీ చేశారు. బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఎస్ఐకి చార్జ్ మెమో అందించినట్లు సమాచారం.

12 మంది సర్పంచుల చెక్ పవర్ రద్దు

కడప సెవెన్‌రోడ్స్ : నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఒంటిమిట్ట మండలంలోని 12 మంది సర్పంచుల చెక్ పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయనే అభియోగాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి విచారణ నిర్వహించారు. ఈ మేరకు నివేదికను సమర్పించడంతో చెక్‌పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఒంటిమిట్ట మండలం గొల్లపల్లె, సాలాబాద్, ఒంటిమిట్ట, మంటపంపల్లె, నరవకాటిపల్లె, పెన్నపేరూరు, కోనరాజుపల్లె, కొత్త మాధవరం, రాచగుడిపల్లె, చింతరాజుపల్లె, నడింపల్లె, గంగపేరూరు సర్పంచులు ఇందులో ఉన్నారు.

కొండను కొల్లగొట్టి.. రహదారి పనులు చేపట్టి.!



రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన గ్రావెల్



లారీల ద్వారా తరలిస్తున్న గ్రావెల్

- గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ
- చోద్యం చూస్తున్న అధికారులు

జమ్మలమడుగు : ప్రకృతి వరప్రసాదమైన కొండలను రోడ్ల నిర్మాణం పేరుతో పూర్తిగా తవ్వేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇటాచీలతో కొండలను కొల్లగొట్టి అందులో ఉన్న గ్రావెల్స్‌ను భారీ లారీలతో తరలిస్తున్నారు. అధికారులు సైతం ఏమీ తెలియనట్లు, పైగా అది తమకు ఎలాంటి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

167వ జాతీయ రహదారి పనుల కోసం ..

నంద్యాల నుంచి జమ్మలమడుగు మండల పరిధిలోని మూడు రోడ్ల క్రాస్ వరకు 167వ జాతీయ రహదారుల పనులు చేపడుతున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో మొత్తం 22 కిలో మీటర్ల పనులు ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చేస్తోంది. అయితే ఎస్‌ఆర్‌సీ కంపెనీ మాత్రం తమకు పదివేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ కావాలని దానికి సంబంధించిన అనుమతులు కోరుతూ రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకుంది. రెవెన్యూ అధికారులు గ్రావెల్ తవ్వకునేందుకు ఎక్కడ అనుమతులు ఇచ్చారో తెలియదు గాని తమకు ఇష్టం వచ్చిన ప్రాంతాన్ని ఎన్నుకుని ఆ ప్రాంతంలో ఇటాచీలతో కంపెనీ మొత్తం కొండను తవ్వేస్తున్నారు.

30 నుంచి 50 ఎకరాల్లో...

మండల పరిధిలోని కొత్తగుంటపల్లె సమీపంలో 30 నుంచి 50 ఎకరాలు ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఎస్‌ఆర్‌సీ కంపెనీ యాజమాన్యం తవ్వకాలు చేపట్టింది. భారీ వాహనాల ద్వారా ఈ ప్రాంతంలో గ్రావెల్‌ను బయటికి తీసి లారీల ద్వారా రోడ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలకు తీసుకెళుతున్నారు. నిత్యం రద్దీగా ఉన్న జమ్మలమడుగు పట్టణంలో నుంచి భారీ లారీల ద్వారా గ్రావెల్‌ను తీసుకెళుతున్నా ఎందుకు, ఎక్కడికి తీసుకెళుతున్నారని ఇటు రెవెన్యూ, అటు పోలీసు అధికారులు సైతం ప్రశ్నించడం లేదు. దీంతో భారీగా గ్రావెల్ తవ్వుకుని రోడ్డు నిర్మాణానికి ఉపయోగించుకుంటున్నారు.

తమకు సంబంధం లేదంటున్న ఆర్డీఓ...

మండల పరిధిలోని కొత్తగుంటపల్లె ప్రాంత సమీపంలో నుంచి అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో గ్రావెల్ అక్రమంగా తీసుకెళుతున్నారని ఆర్డీఓ సాయిశ్రీని ప్రశ్నించగా గ్రావెల్ తీసుకెళ్లేందుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాలి కానీ, అది తమకు సంబంధం లేదని పేర్కొన్నారు.

మేము అనుమతి ఇవ్వలేదు..

జాతీయ రహదారి నిర్మాణం కోసం ఎస్‌ఆర్‌సీ కంపెనీకి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉంది. వారికి మైనింగ్‌కు సంబంధించిన అనుమతులు తాము ఇవ్వలేదని జిల్లా మైనింగ్ అధికారి వెంకటసాయి పేర్కొన్నారు.

యూరియా స్టాక్ పాయింట్లను తనిఖీ చేసిన జేసీ

రాయచోటి : రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులలో ఉన్న యూరియా స్టాక్ పాయింట్లను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మిక తనిఖీ చేశారు. బధవారం రాయచోటి పరిధిలోని చెన్నముక్కపల్లి–2 లోని రైతు సేవాకేంద్రం, పట్టణంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను బుధవారం పరిశీలించారు. యూరియా స్టాక్‌ను పరిశీలించి వ్యవసాయ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్‌తో కలిసి రాయచోటిలోని జాఫర్ సాబ్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి ఆ షాపు యాజమాన్యం నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు.



ఫర్టిలైజర్ షాపును పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

స్వామిత్ర సర్వే పరిశీలన...

రూరల్ మండలం, దిగువ అబ్బవరం గ్రామంలో జరుగుతున్న స్వామిత్ర సర్వే కార్యక్రమాన్ని జేసీ పరిశీలించారు. మండల సర్వేయర్, పంచాయతీ సెక్రటరీలకు తగు సూచనలు చేశారు.


వినాయక నిమజ్జనం వీడియో వైరల్‌పై కేసు నమోదు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో ఇటీవల వినాయక నిమజ్జనం ఉరేగింపు వీడియో వైరల్ అయిన సంఘటనపై గ్రామంలోని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెద్దనపాడు గ్రామంలో వినాయక నిమజ్జనం సమయంలో వినాయకుడి విగ్రహం వెనుక రప్పారప్పా అని రాసిన దృశ్యం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. దీంతో గ్రామ వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీడియోను చూసి అంకాల్‌రెడ్డి, అంకిరెడ్డి, అశోక్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామన్నారు. కాగా మరి కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

కర్ణాటక మద్యం కేసులో ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్ట్

బి.కొత్తకోట : కర్ణాటక మద్యం అక్రమ రవాణా, సరఫరా, మామూళ్ల వసూళ్లకు పాల్పడిన ములకలచెరువు ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను బి.కొత్తకోట సీఐ కె.గోపాల్‌రెడ్డి బుధవారం అరెస్ట్ చేశారు. ఆయన తెలిపిన మేరకు కేసుకు సంబంధించి వివరాలు.. తంబళ్లపల్లెకు చెందిన ఎ.కిరణ్‌కుమార్ (33) మదనపల్లె డివిజన్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన విధులను అడ్డుగా పెట్టుకుని కర్ణాటకలోని రాక్‌వ్యాలీ నుంచి మద్యాన్ని ఇక్కడికి తరలించేవాడు. పనిచేసే చోటనుంచి ఎవరికి అనుమానం రాకుండా బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట గ్రామానికి చెందిన బంధువు రమేష్‌తో మద్యాన్ని తరలించి అమ్మకందార్లకు సరఫరా చేసేవాడు. ఈ వ్యవహారం చాలా కాలంగా గుట్టుగా సాగింది. 2023లో బి.కొత్తకోట స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ పని చేస్తున్న సమయంలో గోళ్లపల్లె గ్రామం చీకుచెట్టుపల్లెలో కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో దాడులు నిర్వహించగా అస్సాంకు చెందిన జుల్‌హర్‌అలీ, గణపతి, పి.రమేష్‌లు పట్టుబడ్డారు. వీరిని అరెస్ట్ చేసి విచారించారు. ఈ విచారణలో రమేష్ తమకు కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నాడని మిగతా ఇద్దరూ వెల్లడించారు. దీనిపై రమేష్‌ను విచారించిన ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ వివరాలను సేకరించారు. తన బంధువైన ఎక్సైజ్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నాడని, తాను అమ్మకందార్లకు విక్రయిస్తానని, అలాగే కర్ణాటక మద్యం విక్రయిస్తున్నందుకు మామూళ్లు వసూలు చేస్తున్నట్టు విచారణలో వెల్లడించారు. విక్రయదార్ల నుంచి ఫోన్ ద్వారా సొమ్ము తీసుకుని ఆ సొమ్మును కిరణ్‌కుమార్‌కు ఫోన్ పే ద్వారా జమ చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాల ఆధారంగా ముగ్గురు నిందితులను అప్పట్లోనే అరెస్ట్ చేశారు. కిరణ్‌కుమార్ విషయంలో జిల్లా ఎస్పీ సమగ్ర దర్యాప్తుకు ఆదేశించడంతో సీఐ గోపాల్‌రెడ్డి విచారణ చేపట్టి ఆధారాలు సేకరించారు. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేశామని సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

జిల్లాలో 14 బార్లకు రీ నోటిఫికేషన్ విడుదల



రీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో 14 బార్లకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 29 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా అందులో 15 బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటికి డ్రా తీశామన్నారు. మిగిలిన 14 బార్లకు దరఖాస్తులు రాకపోవడంతో నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈనెల 14వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఈనెల 8న అప్రెంటీస్ మేళా

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి ఈనెల 8వ తేదీ కడపలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో ఉదయం 10 గంటలకు అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్ ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ మార్కుల జాబితా, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్స్ పుస్తకం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని తెలిపారు. ఎంపికైన వారికి అప్రెంటిస్ శిక్షణలో భాగంగా నెలకు రూ. 7700 నుంచి రూ. 10 వేలు స్టైఫండ్ కంపెనీ చెల్లిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాలో ముగ్గురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



షేక్ జవహర్ మునీర్, పరిమళ జ్యోతి, ఎఫ్ఎంఎస్ ఖాదర్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో ప్రొద్దుటూరు మండలం లింగారెడ్డి నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న షేక్ జవహర్ మునీర్, కాశినాయన మండలం రెడ్డికొట్టాల ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎస్‌జీటీ పరిమళ జ్యోతి, పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయుడు ఎఫ్ఎంఎస్ ఖాదర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు విజయవాడ లబ్బిపేటలోని ఏ– కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందుకోనున్నారు.


బైక్ అదుపుతప్పి డీఎల్‌డీఓ సూపరింటెండెంట్ మృతి



గురుస్వామి(ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం(డీఎల్‌డీఓ)లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తిప్పాబత్తిని గురుస్వామి (57) బుధవారం సాయంత్రం బైకు అదుపు తప్పి కిందపడిన ఘటనలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకునేందుకు బుధవారం సాయంత్రం జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు ఆసుపత్రికి బైక్‌లో బయలుదేరారు. మార్గమధ్యంలో సలివెందుల గ్రామం సుంకాలమ్మ దేవాలయం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. వెనుక వైపు నుంచి వస్తున్న వాహనదారులు గమనించి కిందపడిన గురుస్వామిని లేపి కూర్చోబెట్టారు. గురుస్వామి తన ఫోన్ ఇచ్చి సమాచారాన్ని తన కుమారుడు మురళికి తెలపాలని సూచించడంతో వారు ఫోన్ చేశారు. అనంతరం 108 సహాయంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి



దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం మండలంలోని నూతనకాల్వ పంచాయతీ కామిరెడ్డిగారిపల్లెలో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కామిరెడ్డిగారిపల్లెకు చెందిన అబ్బవరం సత్యంరెడ్డికి చెందిన భూమిలో ఉన్న రాతి కూసాలను బుధవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామిరెడ్డి, ఆనందరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి విరగ్గొట్టారు. దీనిపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీకి చెందిన సత్యంరెడ్డి తోపాటు కంభం కొండారెడ్డి (61), కామిరెడ్డి వెంకటరమణారెడ్డి (42)లపై కొడవలి, రాళ్లు, కర్రలతో దాడి చేశారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ముగ్గురిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు సత్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు.

గణేష్ ఊరేగింపులో యువకుడి హల్‌చల్

పీలేరురూరల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పీలేరులో జరిగిన గణేష్ ఊరేగింపులో రివాల్వర్‌తో ఓ యువకుడు హల్‌చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం పీలేరు పట్టణంలో గణేష్ విగ్రహాల సామూహిక ఊరేగింపు, నిమజ్జనం జరిగింది. ఊరేగింపు సందర్భంగా చెన్నారెడ్డికి చెందిన గణేష్ విగ్రహం వద్ద ఓ యువకుడు రివాల్వర్‌తో డ్యాన్స్ చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. సమాచారం అందుకున్న సీఐ యుగంధర్ విచారణ జరిపి యువకుడు అధికార పార్టీకి చెందిన గుండ్లూరు వెంకటరత్నంగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా రివాల్వర్ ఆకారంలో ఉన్న లైటర్‌గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. లైటర్‌ను స్వాధీనం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ శివకుమార్ ఎదుట బైండోవర్ చేసి విడుదల చేశారు.

ఇది ప్రజలను ముంచే ప్రభుత్వం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచే ప్రభుత్వమని గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, నంద్యాల పార్లమెంటు పరిశీలకురాలు కల్పలతారెడ్డి విమర్శించారు. బుధవారం కడపలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని కూటమి నేతలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి, దాన్ని పీ4కు అప్పగించామని చెప్పడం దారుణమన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి దాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించడం దురదృష్టకరమన్నారు. కూటమి పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారిపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోయారన్నారు. ఉద్యోగులకు ఇంకా పీఆర్‌సీ ప్రకటించలేదని, ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించపోవడం దారుణమన్నారు.

పాఠశాలల్లో నాడు – నేడు పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు– నేడు కింద 80 శాతం పూర్తయిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. చాలాచోట్ల అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు చెట్ల కింద పాఠాలు వినాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. డిజిటల్ బోర్డులు, ట్యాబ్‌లు పాడైపోయాయని, ఆర్‌ఓ ప్లాంట్లు మూతపడ్డాయన్నారు. ఈ సమావేశంలో 46వ డివిజన్ కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై విచారణ



నర్సును విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీతా

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఓ నర్సు సిఫార్సుతో కర్నూల్‌లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించిన ఘటనపై జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత విచారణ చేపట్టారు. బద్వేల్‌కు చెందిన ఒక గర్భిణీ లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు అక్కడే పని చేస్తున్న లత అనే నర్సును ఆశ్రయించింది. ఆమె సూచన మేరకు సదరు గర్భిణీ ప్రొద్దుటూరులోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న ఒక హాస్పిటల్‌లో పని చేస్తున్న రూతు అనే స్టాఫ్‌నర్సు వద్దకు వెళ్లింది. స్టాఫ్ నర్సు కర్నూల్‌లోని ప్రసాద్ అనే ఏజెంట్ ఫోన్ నెంబర్ ఇచ్చి అక్కడికి వెళ్లమని గర్భిణీకి తెలిపింది. ఆమె కర్నూల్‌లో బస్సు దిగగానే అక్కడి ఏజెంట్ గర్భిణీని ఒక స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి లింగనిర్ధారణ పరీక్షలు చేయించాడు. అయితే ఆమెకు ఏడు నెలల గర్భం కావడంతో స్కానింగ్‌లో స్పష్టంగా కనిపించలేదని, నెల రోజులు గడచిన తర్వాత వస్తే మళ్లీ పరీక్షలు చేస్తామని చెప్పి పంపించాడు. అంతే గాక గర్భిణీ వద్ద రూ. 10 వేలు డబ్బు కూడా తీసుకున్నాడు. అయితే కర్నూలుకు వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే ఆమెకు అబార్షన్ అయింది. లింగనిర్ధారణ పరీక్షలు చేయనప్పుడు తమ డబ్బు ఇప్పించాలని బద్వేల్‌కు చెందిన మహిళ ప్రొద్దుటూరులోని నర్సును నిలదీసింది. ఈ విషయం బయటికి పొక్కడంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీతా బుధవారం హాస్పిటల్‌కు వెళ్లి నర్సును విచారించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై ఇప్పటికే విచారణ చేశామని, కర్నూల్‌లో స్కానింగ్ జరగడంతో అక్కడి వ్యక్తులు, స్కానింగ్ సెంటర్ వివరాలను కర్నూలు డీఎంహెచ్ఓకు తెలిపామన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రొద్దుటూరులోని పలు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై ఆరోపణలు వస్తున్న మాట వాస్తవమేనని అయితే తగు ఆధారాలుంటే తప్పకుండా స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నమోదైన కేసుల్లో అధిక సంఖ్యలో రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని సూచనల మేరకు బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో బుధవారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత పోలీసు స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ముందస్తుగా సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి మరింత సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హెగ్డే, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం ఆర్.కృష్ణమోహన్, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి.రాజేంద్రప్రసాద్, ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి.భావన, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం



నాగ చాతుర్య, కడప (53 పరుగులు)



శివ కేశవ, కడప (43 పరుగులు)



ప్రమోద్ కుమార్, అనంతపురం (5 వికెట్లు)



ప్రశాంత్, అనంతపురం (90 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. వైఎస్‌ఆర్‌ఆర్ క్రికెట్ స్టేడియంలో కడప–కర్నూలు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఆ జట్టులోని నాగ చాతుర్య 53 పరుగులు, విజయ్ రామిరెడ్డి 62 పరుగులు, శివ కేశవ 43 పరుగులు, అయూబ్ 36 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు–అనంతపురం జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 44.4 ఓవర్లకు 239 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని పవన్ రిత్విక్ 50 పరుగులు, మాధవ్ 56 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ చక్కటి లైనప్‌తో బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. భార్గవ్ 2 వికెట్లు, ప్రవీణ్‌కుమార్ సాయి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 36 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రశాంత్ 90 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 52 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నారాయణ 2 వికెట్లు, మాధవ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

టీడీపీ అధిష్టానంపై 'డైరెక్ట్'ఎటాక్!

వేర్ హౌస్ డైరెక్టర్ పదవిని తిరస్కరించిన బాలిశెట్టి హరిప్రసాద్

కడప రూరల్ : జిల్లా తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగ రగులుతోంది. జిల్లాలో పార్టీకి అధికంగా ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయి. దీంతో రాజకీయంగా ప్రాధాన్యత ఉంటుందని తమ్ముళ్లు భావించారు. నామినేటెడ్ పోస్టులతో న్యాయం జరుగుతుందని అందరూ అనుకున్నారు. అయితే అందరి అంచనాలు తల్లకిందులయ్యాయి. అధిష్టానం జిల్లాకు విదిలించినట్టుగా నామమాత్రంగా బుధవారం ఐదుగురికి డైరెక్టర్ పదవులను కేటాయించింది. అందులో కడప నగరానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్‌ను వేర్ హౌస్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ నియామకంపై ఆయన భగ్గుమన్నారు. తీవ్ర స్థాయిలో తన అసంతృప్తిని వెళ్లగక్కారు. 'పార్టీలో నా సీనియారిటీని, కష్టాన్ని గుర్తించి నాకు డైరెక్టర్ పదవిని ఇప్పించిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే మాధవి రెడ్డికి కృతజ్ఞతలు. అంత పెద్ద పదవిని స్వీకరించే స్థాయి నాకు లేదు. ఆ పదవిని ఇతరులకు ఇప్పించవలసిందిగా మనస్ఫూర్తిగా మిమ్మల్ని కోరుచున్నాను' అంటూ వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు. ఒక బలమైన సామాజిక వర్గాన్ని ఇంతలా కించపరచడాన్ని తమ సామాజిక వర్గం జీర్ణించుకోలేకపోతోంది అంటూ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. పార్టీ పదవులు ఇచ్చినా ఇవ్వకపోయినా అంకితభావంతో పనిచేస్తాం. పదవిని నేను స్వీకరించడం లేదు. దీన్ని మీరు నా రాజీనామాగా పరిగణించాలంటూ పార్టీ నేతలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల కేటాయింపుపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. తాజాగా హరిప్రసాద్ అంశం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.